క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌ సీపీ సమావేశం

ఐ.పోలవరం: కేశనకుర్రుపాలెం క్షత్రియ కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ మండలస్థాయి విస్తృత సమావేశం ఆదివారం నిర్వహించనున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు అధ్యక్షతన మధ్యాహ్నం రెండున్నర గంటలకు ఈ సమావేశం జరగనుంది. పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌ కుమార్‌ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని వెంకటపతిరాజు శనివారం తెలిపారు. మండల కమిటీ ప్రతినిధులు, నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీకి చెందిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మండల పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

అమలాపురంలో 29న స్పేస్‌ స్కిల్‌ శిబిరం

అమలాపురం రూరల్‌: ఇస్రో, భాగస్వామ్యంతో సైన్స్‌ సిటీ, అమరావతి ఆధ్వర్యంలో అంతరిక్షంపై అవగాహన శిబిరం స్పేస్‌ స్కిల్‌ శిబిరం నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌కే సలీం బాషా తెలిపారు. జిల్లాస్థాయిలో అమలాపురం జిల్లా ప్రజాపరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 29న ఉదయం 9.30 గంటలకు శిబిరం నిర్వహిస్తామన్నారు. విద్యా విభాగం ఆధ్వర్యంలో సైన్స్‌ సిటీ ఆఫ్‌ అమరావతి సమగ్ర శిక్ష–ఏపీ ముస్కాన్‌ ఎడ్యుకమ్‌ ఫౌండేషన్‌ సంస్థల సహకారంతో స్పేస్‌ స్కిల్‌ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇస్రో ప్రయోగాలు, ఉపగ్రహాలు, అంతరిక్ష ప్రయోగాలపై వినూత్న ప్రదర్శనలు, స్పేస్‌ మోడల్స్‌, విజువల్‌ డెమోస్‌, వీడియో ప్రెజెంటేషన్‌, శాస్త్రజ్ఞుల ఇంటరాక్టివ్‌ సెషన్లు, కెరీర్‌ మార్గదర్శనం, సైన్స్‌ సిటీ నుంచి రిసోర్స్‌ పర్సన్ల ప్రత్యేక ఉపన్యాసాలు, స్పేస్‌ క్విజ్‌లు, ఆటల ద్వారా నేర్చుకోవడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఈకార్యక్రమం ఉపయోగపడుతుందని డీఈవో అన్నారు.

ముంపు సమస్యను తట్టుకునే వరి వంగడాలు సిద్ధం

ఉప్పలగుప్తం: తొలగరి సాగులో ముంపును తట్టుకుని, చౌడు భూముల్లో సైతం పంటలు పండే వంగడాలను ఎంచుకోవాలని వరి ప్రధాన శాస్త్రవేత్త ఎమ్‌.గిరిజారాణి రైతులకు సూచించారు. మండలంలో గొల్లవిల్లిలో రైతు వరి క్షేత్రాల్లో శనివారం డాట్‌ కో ఆర్డినేటర్‌ ఎమ్‌.నందకిషోర్‌, వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబుతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఎంటీయూ 1232, ఎంటీయూ 1243 రకపు విత్తనాలను రైతులు సాగులో వినియోగించాలని, ఈ వంగడాలు ముంపు సమస్యను తట్టుకుంటాయని, 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తుందని ఆమె సూచించారు.

నిత్యాన్నదానానికి విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు అమెరికాలో నివాసముంటున్న పొన్నపల్లి రామకృష్ణ ఆన్‌లైన్‌ ద్వారా శనివారం రూ.పది వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతను సహాయ కమిషనర్‌, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ ఫోన్‌లో అభినందించారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు కస్తూరికి సత్కారం

అమలాపురం టౌన్‌: జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన చిలకమర్రి కస్తూరిని స్థానిక కూచిమంచి సీతమ్మ వీధిలో భూపయ్య అగ్రహారం మిత్ర మండలి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి లయన్స్‌ వశిష్ట జోన్‌ చైర్‌పర్సన్‌ కూచిమంచి సంధ్యారాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కస్తూరి బీజేపీ నాయకురాలిగానే కాకుండా సామాజిక సేవా రంగంలో ఎప్పుడూ ముందు ఉంటుందని చెప్పారు. కస్తూరి గ్రామీణ ప్రాంతాల్లో అక్కడి ప్రజలతో మమేకమై వారి సమస్యల పట్ల స్పందించే సేవా గుణం అభినందనీయమని పేర్కొన్నారు. మిత్ర మండలి ప్రతినిధులు పేరి లక్ష్మీ నరసింహం, శిష్టా శ్రీహరి, కూచిమంచి కృష్ణ, పుత్సా కృష్ణ కామేశ్వర్‌, భమిడిపాటి లక్ష్మీ, కె.భాను, లలిత తదితరులు కస్తూరి ఘనంగా సత్కరించి అభినందించారు.

ఎమ్మెల్యే గొల్లపల్లి పరామర్శ

యానాం: తాళ్లరేవు మండలం పటవల జాతీయ రహదారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కురసాంపేటకు చెందిన కూరాకుల కుమార్‌రాజా కుటుంబ సభ్యులను యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్‌ శనివారం పరామర్శించారు. హాస్పిటల్‌లో పంచనామా పనులు త్వరితగతిన పూర్తిచేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని హాస్పిటల్‌ యాజమాన్యానికి ఆదేశాలిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్‌ ఆందోళన

ముమ్మిడివరం: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముమ్మిడివరం విద్యాశాఖ కార్యాలయం ఎదుట యూటీఎఫ్‌ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు.ఆందోళనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం మారినా పాఠశాల విద్యాశాఖలో మూలాలు మారకపోవడంతో సమస్యలు యధాతథంగానే కొనసాగుతున్నాయన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్‌ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముంపు ముప్పు.. ఏదీ కనువిప్పు!

- గోదావరికి వరద పోటెత్తడంతో పొంచి ఉన్న ప్రమాదం
- ఏటా ముంపు బారిన పడుతున్న లోతట్టు ప్రాంత పొలాలు
- కొద్దిపాటి వర్షాలకే లంక గ్రామాలు మునక
- అస్తవ్యస్తంగా మురుగునీటి కాలువలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


గుర్రపు డెక్కతో పూడుకుపోయిన ముమ్మిడివరం మేజర్‌ డ్రెయిన్‌


గాడిలంకలో ముంపునకు గురైన నారుమడులు

ముమ్మిడివరం: అధిక వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ముంపు ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడిగా పర్యటించి తూతూ మంత్రంగా తాత్కాలిక చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారే తప్ప ముంపు బారిన పడకుండా శాశ్వత చర్యలు చేపట్టడం లేదని, ఏటా వారిచ్చే హామీలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. వర్షం వస్తే చాలు లోతట్టు ప్రాంతాల ప్రజలకు కంటిపై కునుకు కరువవుతుంది. గోదావరికి వరద పోటెత్తినప్పుడు లంక గ్రామాల ప్రజలు అరచేత్తో ప్రాణాలు చేతపట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తారు.

శాశ్వత చర్యలు శూన్యం

గతేడాది గోదావరి పోటెత్తినప్పుడు, వర్షాలు, వరదల వల్ల ముమ్మిడివరం తిల్లమ్మ చెరువు, జీఎంసీ బాలయోగి కాలనీ, కంసాలగరువు, మండబయలు కాలనీ, అయినాపురం కొత్తకాలనీ, బొర్రాగట్టు, పెదమెట్టలంక, గాండిలంకలో ఎస్సీకాలనీ, కొత్త కాలనీ, కర్రివానిరేవు కొత్తలంకలో మట్లపాలెం, కొమానపల్లి అంబేడ్కర్‌ నగర్‌, లంకాఫ్‌ఠానేల్లంక తోపాటు పలు లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తాత్కాలిక సహాయం అందించి చేతులు దుపులుకున్నారు. ఇప్పటి వరకు ముంపు నివారణకు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇవన్నీ లోతట్టు ప్రాంతాలు కావడంతో కొద్దిపాటి వర్షాలకే ముంపుబారిన పడుతున్నాయి. మండలంలోని మురుగునీటి కాలువలు తూడు గుర్రపుడెక్కతో పూడుకుపోయి ముంపు నీరుదిగేందుకు అవరోధంగా తయారవుతున్నాయి. వరదల సమయంలో మురుగునీటి కాలువలకు ఉన్న అవుట్‌పాల్‌ స్లూయిజ్‌ల మరమ్మతులకు నోచుకోక వరద నీరు స్లూయిజ్‌ల ద్వారా కాలువల్లోకి చేరి ముంపు బారిన పడుతున్నాయి. మురుగునీటి కాలువల ఆధునీకరణకు శాశ్వత చర్యలు చేపడతామని వాటి ఆధునీకరణకు నిధులు సమకూర్చామని ఏటా పాలకులు, అధికారులు చెబుతున్నా నేటికీ ఒక్క పైసా ఖర్చుచేసిన పాపాన పోలేదు. వేసవి సీజన్‌లో కాలువల ఆధునీకరణకు నోచుకోకపోవడంతో ఈ ఏడాది కూడా ముంపు తప్పేటట్టు లేదని లోతట్టు ప్రాంత వాసులు వాపోతున్నారు. కొన్ని రోజులుగా కురిసన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. నారుమడులు నీట మునిగాయి. మున్ముందు వర్షాలు, వరదలు అధికంగా వచ్చే అవకాశమున్నందున రైతులు, లోతట్టు ప్రాంతా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ముంపునకు గురైన తిల్లమ్మ చెరువు కాలనీ (ఫైల్‌)

డ్రెయిన్ల పరిస్థితి అధ్వానం

ముమ్మిడివరం నియోజకవర్గంలో రెండు ప్రధాన డ్రెయిన్లు, ఏడు మధ్యతరహా డ్రెయిన్లు, 80 మైనర్‌ డ్రెయిన్లు ఉన్నాయి. ప్రధాన డ్రెయిన్లు, 35 కిలోమీటర్లు, మధ్యతరహా డ్రెయిన్లు 75 కిలోమీటర్లు, మైనర్‌ డ్రెయిన్లు 280 కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి. వర్షాలు, వరదల వచ్చే ముంపు నీటిని గోదావరిలోకి మళ్లించేందుకు ఈ డ్రెయిన్లు ప్రధాన మార్గం. ఈ డ్రెయిన్లు దశాబ్దాలకాలంగా ఆధునీకరణకు నోచుకోకపోవడంతో అస్తవ్యస్తంగా తయారై పూడుకుపోయాయి. ముంపునీరు దిగేందుకు అవరోధంగా తయారయ్యాయి. దీనికి తోడు తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయి వర్షాలు, వరదల సమయంలో అవి పొంగి ప్రవహించి కాలనీలను ముంచెత్తుతున్నాయి. ఇప్పటికైనా ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

డ్రెయిన్లను ఆధునీకరించాలి



ప్రధాన మేజర్‌ డ్రెయిన్లు ఆనుకుని ఉన్న లింకు డ్రెయిన్లను ఆధునీకరించాలి. డ్రెయిన్ల ఎగువ నుంచి ముంపు నీరు దిగక గ్రామాన్ని ముంచెత్తుతోంది. ఏటా వరదల సమయంలో స్లూయిస్‌ నుంచి వరదనీరు డ్రెయిన్ల గుండా వరద పోటెత్తి వరి చేలను, లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి.

– ఏఎస్‌వీ సుబ్బారావు, రైతు, అయినాపురం

అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు

- కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిద్దాం
- వైఎస్సార్‌ సీపీ కోఆర్డినేటర్‌ పొన్నాడ పిలుపు
- ముమ్మిడివరంలో కార్యకర్తలకు దిశానిర్దేశం


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ కోఆర్డినేటర్‌ పొన్నాడ

ముమ్మిడివరం: అమలు కాని అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని ముమ్మిడివరం నియోజకవర్గ కోఆర్డినేటర్‌ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్‌ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ముమ్మిడివరం టౌన్‌ వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు బొంతు సత్య శ్రీనివాస్‌ అధ్యక్షతన శనివారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' మండల స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సభా వేదికపై పొన్నాడతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు దివంగత నేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా మండలంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పొన్నాడ పిలుపునిచ్చారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం పనిచేసారని, నాయకులు, కార్యకర్తలు తలెత్తుకు తిరిగేలా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించారన్నారు. పార్టీ అభివృద్ధికి కష్టించి పని చేసే కార్యకర్తలకు, నాయకులకు తగిన గుర్తింపు తప్పక ఉంటుందని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెడ్‌ బుక్‌ రాజ్యాంగం నడుస్తోందని, అక్రమ కేసులు పెట్టి వైఎస్సార్‌ సీపీ నాయకులను ఇబ్బంది పెడుతూ పార్టీని నిర్వీర్యం చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు, అరెస్టులు కొనసాగిస్తే రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పొన్నాడ హెచ్చరించారు. ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి రూ.15వేలు ఇస్తామన్న హామీని అమలు చేయడం సాధ్యం కాదని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించడం దారుణమన్నారు. సూపర్‌ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోందని పొన్నాడ విమర్శించారు.

కూటమి ప్రభుత్వ బాధితులకు అండగా ఉంటాం

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిపితాని బాలకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తోందని అధైర్య పడవద్దని, బాధితులకు అండగా ఉంటామన్నారు.పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పెన్మత్స చిట్టిరాజు, నియోజకవర్గ పరిశీలకుడు మాతా మురళి, పెయ్యల చిట్టిబాబు, కాశి బాలమునికుమారి, కమిడి ప్రవీణ్‌కుమార్‌, కుడిపూడి శంకరరావు, రాయపురెడ్డి జానకీరామయ్య, కోన శ్రీనివాసరావు, కోలా బాబ్జీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగతా పద్మనాభం, నల్లా నరసింహమూర్తి, కాశి వెంకటరమణ,రెడ్డి శివన్నారాయణ, దొమ్మేటి అప్పారావు, పాము చిట్టిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా మూలమంత్ర శాంతిహోమం


గనికమ్మ వారిని దర్శించుకున్న మున్సిపల్‌ కమిషనర్‌ నిర్మల్‌కుమార్‌ తదితరులు

అమలాపురం టౌన్‌: స్థానిక వంటెద్దు వారి వీధిలో వేంచేసి ఉన్న గనికమ్మ ఆలయం 20వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గనికమ్మ సన్నిధిలో అభిషేకాలు, హోమాలు, కుంకుమ పూజలు, మూలమంత్ర శాంతి హోమం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి వార్షికోత్సవంలో పాల్గొనేందుకు అనేక మంది పట్టణ ఆడపడుచులు తమ ఇంటి ముందుకు వచ్చిన గనికమ్మకు మొక్కలు తీర్చుకున్నారు. అముడా చైర్మన్‌ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్‌ కమిషనర్‌ వి.నిర్మల్‌కుమార్‌, జిల్లా షటిల్‌ బాడ్మింటన్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, పట్టణ కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, మాజీ కౌన్సిలర్‌ ఆశెట్టి ఆదిబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం వద్ద ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

కార్గిల్‌ అమర వీరులకు కాగడాలతో నివాళి


కాగడాలతో కార్గిల్‌ అమర వీరులకు నివాళులర్పిస్తున్న జిల్లా బీజేపీ నాయకులు

అమలాపురం టౌన్‌: దేశ రక్షణ కోసం ప్రాణాలు విడిచిన కార్గిల్‌ అమర వీరులకు జిల్లా బీజేపీ స్థానిక గడియారం స్తంభం సెంటరులో శనివారం రాత్రి కాగడాలతో ఘన నివాళులర్పించింది. కార్గిల్‌ విజయ్‌ దివస్‌ కార్యక్రమాన్ని జిల్లా బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ మండల సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గడియారం స్తంభం సెంటరులో వెలుగుతున్న కాగడాలతో ర్యాలీ నిర్వహించి దేశ రక్షణ కోసం వారు చేసిన త్యాగాలకు జోహార్లు అర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకురుమిల్లి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి వెంకటేశ్వరరావు, చిలకమర్రి కస్తూరి, అడపా శ్రీనివాసరావు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, పార్టీ ప్రతినిధులు కొండేటి ఈశ్వర గౌడ్‌, దాట్ల వెంకట సుబ్బరాజు, బొంతు శివాజీ, పేరూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని కార్గిల్‌ అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పని చేయాలి

ఎంపీపీ కోలా గంగా భవాని


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోలా గంగా భవాని

ముమ్మిడివరం: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ కోలా గంగాభవాని సూచించారు. మండల పరిషత్‌ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. తొలుత వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతిని వివరిస్తుండగా అయినాపురం సర్పంచ్‌ మోకా రామారావు మాట్లాడుతూ పలు సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పలు సమస్యలను ఇప్పటికీ పరిష్కరించలేదని ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్‌ పాటించడం లేదని రామారావు విమర్శించారు. గ్రామంలో రూ.5లక్షలతో కెనాల్‌పై వంతెన నిర్మించారని, పంచాయతీ తీర్మానం లేకుండా ఎలా పనులు చేపట్టారని ఆయన ప్రశ్నించారు. మండల విద్యాశాఖాధికారి డి.గౌరిశంకర్‌ మండలంలో తమ శాఖ పనితీరును వివరిస్తుండగా అయినాపురం ఎంపీటీసీ మట్టపర్తి సురేష్‌ మాట్లాడుతూ తల్లికి వందనం సొమ్ము చాలా మందికి జమ కాలేదని ప్రశ్నించారు. దీనిపై ఎంఈఓ వివరణ ఇస్తూ సాంకేతిక సమస్య పరిష్కరించిన అనంతరం అందరికీ పథకం సొమ్ము జమ అవుతాయన్నారు. విద్యుత్‌ సమస్యపై వైస్‌ ఎంపీపీ మట్టపర్తి సురేష్‌ ప్రశ్నించగా ఆ శాఖ ఏఈ శివశంకర్‌ వివరణ ఇస్తూ కొత్తలంక ఫీడర్‌లో సమస్య తలెత్తడంతో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ టి.వెంకటాచార్య, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, తహసీల్దార్‌ సుభాష్‌, ఐసీడీఎస్‌ సీడీపీఓ నిహారిక, మట్టపర్తి సత్యనారాయణ, పాము నాగమణి, వివిధ శాఖాధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మడ అడవులను పరిరక్షించాలి


కందికుప్ప అటవీ సెక్షన్‌ పరిధిలో మడ అడవుల పరిరక్షణ దినోత్సవంలో అటవీ శాఖ సిబ్బంది

కాట్రేనికోన: మండలంలోని రాత్రి కాలువ, కందికుప్ప అటవీ సెక్షన్‌ పరిధిలోని అటవీ శాఖ సిబ్బంది శనివారం అంతర్జాతీయ మడ అడవుల పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కందికుప్ప డీఆర్వో బీఎస్‌ సత్యనారాయణ ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడ అడవులు సముద్ర తీరం వెంబడి జల చరాలకు ఆవాసంగా, ప్రకృతి వైపరీత్యాలు తుపాన్లు, సునామీ, వరదలు నుంచి తీరప్రాంతాలకు రక్షణగా నిలుస్తున్నాయన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మడ అడవులు ద్రోహద పడుతున్నాయన్నారు. కందికుప్ప అటవీ సెక్షన్‌ పరిధిలో మడ అడవులను పెంచుతున్నట్టు తెలిపా. ఈకార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది సాయిబాబు ఉన్నారు.

మంత్రి సుభాష్‌ అనుచరులను అరెస్ట్‌ చేయాలి


కలెక్టరేట్‌ వద్ద ధర్నా చేస్తున్న వీసీకే పార్టీ, దళిత ప్రజా సంఘాల నాయకులు

అమలాపురం రూరల్‌: దోనిపాటి మహేష్‌ను కిడ్నాప్‌ చేసి చిత్రహింసలకు గురిచేసిన కేసులో మంత్రి వాసంశెట్టి సుభాష్‌ ముఖ్య అనుచరులు యల్లమెల్ల విజయ్‌శంకర్‌, రాయల్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ గుత్తుల విజయ్‌కుమార్‌ను అరెస్టు చేయాలని కలెక్టరేట్‌ వద్ద శనివారం వీసీకే పార్టీ, దళిత ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌జే విద్యాసాగర్‌, కేవీపీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు ఆండ్ర మాల్యాద్రి, ఏఐఎం రాష్ట్ర ఇన్‌చార్జి మదిరి శేషయ్య, సీపీఎం జిల్లా అధ్యక్షుడు కారేం వెంకటేశ్వరరావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌ మాట్లాడుతూ నకిలీ ఉద్యోగాల రాకెట్‌ నడిపిన ఉదయశంకర్‌, సూత్రధారి గుత్తుల విజయ్‌కుమార్‌ను పోలీసులు ఇప్పటి వరకు అరెస్ట్‌ చేయలేదని ఆరోపించారు. కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందించారు. క్రిస్టియన్‌ ఫోరమ్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు ప్రటూరు సహదేవ, విజయ్‌కుమార్‌, ఏపీ ఎస్సీ ఎస్టీ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎన్‌ఎంయూ ఉద్యోగుల నిరసన

అమలాపురం రూరల్‌: ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ ఎన్‌ఎంయూ ఉద్యోగులు అమలాపురం డిపోలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ ప్రతిపాదనకు తీవ్రమైన అభ్యంతరం తెలియజేస్తూ నిరసన తెలిపారు. జిల్లాలో నాలుగు డిపోల్లో ఆందోళన చేసినట్లు వారు తెలిపారు. ఈ ప్రతిపాదనలు రద్దు చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని డిపోల్లో ఉన్న స్థానిక, రాష్ట్ర నాయకులు, జోనల్‌ నాయకులు, జిల్లా కమిటీ నాయకులు, డిపో నాయకులు, గ్యారేజీ నాయకులు పాల్గొన్నారు.

వినాయక ఆలయ హుండీలో నగదు చోరీ

అల్లవరం: గోడిపాలెం రాజులవీధిలోని వినాయక ఆలయంలో శుక్రవారం రాత్రి అగంతకులు చొరబడి ఆలయంలోని హుండీని పగలుకొట్టి నగదు అపహరించారు. శుక్రవారం రాత్రి ఆలయానికి సమీపంలోని తోటలోకి హుండీని తీసుకెళ్లి నిర్మానుష్య ప్రాంతంలో పగలుకొట్టి నగదు చోరీ చేశారు. శనివారం ఉదయం ఆలయం తలుపులు తీసి ఉండడంతో స్థానికులు ఆలయంలోకి వెళ్లి పరిశీలించగా హుండీ చోరీకి గురైందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. హుండీలో రూ. 30 వేల నగదు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులకు పోలీసులకు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ఇంటింటికీ 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ'


అల్లవరంలో సమావేశమైన వైఎస్సార్‌ సీపీ నేతలు

అల్లవరం: బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తామని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. వైఎస్సార్‌ సీపీ మండలపార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ అధ్యక్షతన అల్లవరంలోని ఆయన నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 29న తాడికోన గ్రామంలో ఉదయం 9 గంటలకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకలు, కర్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర నాయకులు నాతి శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్‌ కార్యదర్శి చింతా రామకృష్ణ, తిక్కా ప్రసాదు, దొమ్మేటి శ్యాం ప్రకాష్‌, పరమట శ్రీను, పల్లి జేమ్స్‌, పులుసుగంటి గంగాధర్‌, సాపే సత్యనారాయణ పాల్గొన్నారు.

120 వంటకాలతో అల్లుడికి అదిరిపోయే విందు


పి.మల్లవరంలో 120 రకాల వంటకాలతో కొత్త అల్లుడికి విందు భోజనం

తాళ్లరేవు: కొత్త అల్లుడికి 120 రకాల వంటకాలతో అదిరిపోయే జంబో విందు వడ్డించి అత్తమామలు అబ్బురపరిచారు. మల్లవరం గ్రామానికి చెందిన పితాని వీరబాబు కుమార్తె నాగశ్యామలకు తాళ్లరేవుకు చెందిన కట్టా జానకి దుర్గాప్రసాద్‌కు ఇటీవల వివాహమైంది. ఆషాఢ మాసం ముగిసి శ్రావణ మాసం రావడంతో కొత్త అల్లుడికి అత్తమామలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సుమారు 120 రకాల పిండి వంటలు, పండ్లతో జంబో విందు వడ్డించారు. ఆయా వంటకాలను చూసి అవాక్కవడం అల్లుడి వంతయ్యింది. ఈ విషయం తెలియడంతో స్థానికులు ఆసక్తిగా చర్చించుకున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

అమలాపురం రూరల్‌: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజన వడ్డించాలని పథకం నిర్వాహకులకు డీఈవో ఎస్‌కే సలీం బాషా సూచించారు. కోనసీమ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 26 పాఠశాలను ఎంపిక చేసి పీఎంశ్రీ పాఠశాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై అభ్యంతరాలను స్వీకరించి వాటిని పరిష్కరిస్తున్నట్టు డీఈవో తెలిపారు. జనవరి, ఫిబ్రవరి నెలలకు సోషల్‌ ఆడిట్‌ సమగ్ర శిక్ష పీఎం పోషణ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంపై సామాజిక తనిఖీ నిర్వహించారు. జిల్లాస్థాయిలో ప్రజా వేదిక కార్యక్రమం సమనస గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించారు. సోషల్‌ ఆడిట్లో వచ్చిన అంశాలు భవిష్యత్తులో మళ్లీ పునరావృతం కాకూడదని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్‌ కోఆర్డినేటర్‌ ఎమ్‌ మమ్మీ, కమ్యూనిటీ మొబైల్‌ ఆఫీసర్‌ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎస్‌టీయం.కే సత్యనారాయణ రావు, ఎస్‌ఆర్‌పీ కనకారావు డీఆర్పీలు ఎస్‌ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

ఒలుపు కార్మికులను హడలెత్తించిన తాచుపాము


తాచుపామును పట్టుకున్న స్నేక్‌ క్యాచర్‌ వర్మ

అల్లవరం: కొబ్బరి రాశిలో ఐదు అడుగుల తెల్లతాచు ఒలుపు కార్మికులను హడలెత్తించింది. శనివారం మధ్యాహ్నం అల్లవరంలో కొబ్బరి కొట్టు యజమాని శంకర్‌కు చెందిన కొబ్బరి రాసి వద్ద కార్మికులు కాయలు వలుస్తున్నారు. అప్పటికే కొబ్బరికాయల్లో చేరిన పాము అలికిడికి బుసలు కొట్టింది. భయాందోళనకు గురైన కార్మికులు భీమనపల్లికి చెందిన స్నేక్‌ క్యాచర్‌ వర్మకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న వర్మ ఆరడుగుల పామును బంధించి సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టారు. కొబ్బరి రాశుల్లో ఎలుకలు, కప్పలు ఉంటాయని, వాటిని తినడానికి పాములు చేరతాయని ఒలుపు కార్మికులు అప్రమత్తంగా ఉంటూ పనులు చేసుకోవాలని వర్మ సూచించారు. పాములు కనిపించిన వెంటనే తనను సంప్రదిస్తే సురక్షితంగా బంధించి నిర్జన ప్రదేశాల్లో విడిచి పెడతానని వర్మ తెలిపారు.

రాజీవ్‌ బీచ్‌లో మృతదేహం

యానాం: స్థానిక రాజీవ్‌బీచ్‌లోని గౌతమి గోదావరి ఒడ్డున గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగి ఉండి ఆకుపచ్చరంగు టీషర్టు, నల్ల నిక్కరు ధరించి ఉన్నాడని పోలీసులు శనివారం తెలిపారు. మృతదేహాన్ని యానాం ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసినవారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.